బోనాల ఉత్సవాల్లో పోతరాజుదే హవా

- అమ్మవారికి సోదరుడు పోతలింగన్న
- అన్ని విధాలుగా సోదరికి అండగా ఉంటారనే నమ్మకం
- ఘట స్థాపన, శాకంబరి, బోనాల సమర్పన, తొట్టెల ఊరేగింపు, ఘట పరి సమాప్తి తదితర కార్యక్రమాల్లో పోతురాజు పాత్ర కీలకం



బోనాల ఉత్సవాల్లో పోతరాజులు (ఫైల్)

చార్మినార్: బోనాల ఉత్సవాల్లో పోతరాజుల హవా కొనసాగుతుంది. ఆషాఢమాసం బోనాల ఉత్సవాల్లో పోతరాజుకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఘట స్థాపన, శాకంబరి, రంగం, గావు, బోనాల సమర్పన, తొట్టెల ఊరేగింపు, ఫలహారపు బండి ఊరేగింపు, ఘట పరి సమాప్తి తదితర పూజా కార్యక్రమాల్లో పోతురాజు పాత్ర కీలకంగా ఉంటుంది. అప్పట్లో మీరాలంమండి మహంకాళి ఆలయంలో పోతరాజుగా వ్యవహరించిన కాసుల పెంటయ్యకు నిజాం ప్రభువు కాంస్య పథకాన్ని అందజేశారు.

అప్పట్లో బోనాలకు నిజాం సర్కార్ ఏర్పాట్లు..

- 7వ నిజాం నవాబ్ మీర్ మహబూబ్ అలీ ఖాన్ హయాంలో బోనాల పండుగకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయించే వారని ఉత్సవాల నిర్వాహకులు చెబుతున్నారు.
- పసుపు, కుంకుమలతో పాటు పట్టు వస్త్రాలను పంపే వారని అంటున్నారు.
- నిజాం హయాంలో ప్రధాన మంత్రిగా కొనసాగిన మహారాజా కిషన్ పర్షాద్ సలహాలు, సూచనల మేరకు నిజాం నవాబ్ మీర్ మహబూబ్ అలీ ఖాన్ బోనాల పండుగకు ఏర్పాట్లు చేసే వారని చెబుతున్నారు.
- ప్రస్తుతం పాతబస్తీలోని పురాతన ఆలయాలు నిజాం కాలం నుంచి భక్తుల పూజలు, దూప, దీప నైవేద్యాలతో కొనసాగుతున్నాయి.

ఒకప్పటి పోతలింగన్నే ఇప్పటి పోతురాజు..

- ఒకప్పటి పోతలింగన్నే ఇప్పటి పోతురాజు.
- బోనాల జాతరలో పోతరాజే ప్రధాన ఆకర్షణగా నిలుస్తాడు.
- అమ్మవారికి నైవేద్యం సమర్పించేటప్పుడు పోతరాజు చేసే నృత్యాలు, హావభావాలు, కొరడా ఝుళిపించడం తదితర విన్యాసాలు అందరిని అలరిస్తాయి.
- పోతరాజు కొరడా దెబ్బలను తింటే దుష్ట శక్తులు ఆవహించవని ప్రతీతి.
- దీంతో భక్తులు కొరడా దెబ్బలు తినేందుకు పోటీ పడుతుంటారు.

పోతరాజంటే..

- పోతరాజంటే ఏడుగురు అక్కల ముద్దుల తమ్ముడు.
- అమ్మవారిని పొలిమెర నుంచి గ్రామంలోని ఆలయానికి తీసుకొచ్చేటప్పుడు, అనంతరం సాగనంపేటప్పుడు రక్షణగా ముందు నడుస్తూ ఉంటాడు.
- డప్పుచప్పుళ్లకనుగుణంగా ఆనందంతో నృత్యం చేస్తూ స్వాగతిస్తుంటాడు.
- ఏడుగురు అక్కాచెల్లెల్లైన అమ్మవారులకు ఈ పోతరాజంటే అమితానందం.
- దీంతో ఆయన సూచించిన రహదారిలో నడుస్తూ ఆలయానికి తరలివస్తారు.
- ఆయన గావుతో శాంతించి పొలిమెర దాటుతారు.
- పెళ్లైన వారు మాత్రమే పోతరాజుగా వ్యవహరిస్తారని చెబుతున్నారు.

బోనాలకు వారం రోజుల పాటు నిష్టగా పూజలు..

- సాధారణంగా పోతరాజులు ఏడాది పొడవునా తమ దైనిందిన పనుల్లో బిజీగా ఉంటారు.
- ఆషాఢమాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని ఒక వారం రోజులు తమ పనులను పక్కన పెట్టి అమ్మవారి పూజల్లో నిమగ్నమవుతారు.
- పోతరాజు వేషధారణ అంటే దీక్షతో కూడుకున్న వేషధరణ.
- ఘటాలను ఆలయంలో ప్రతిష్ఠించిన నాటి నుంచి దీక్షతో ఉంటూ అమ్మవారిని పూజిస్తారు.
- పోతరాజు వేసే ఒక్కరోజు ముందు నుంచే ఉపవాస దీక్షలో ఉంటారు.
- పోతరాజు వేషధారణ శాంతి అయ్యే వరకు ఎలాంటి మత్తు పదార్థాలను కాని మాంసాహారాన్ని కాని తీసుకోరు.

మీరాలంమండిలో 6వ తరం పోతరాజు..

- పాతబస్తీ డబీర్‌పురాకు చెందిన పోతరాజుల కుటుంబం 1902 నుంచే కొనసాగుతుంది.
- నిజాం కాలంలో బంగారయ్య పోతరాజుగా వ్యవహరించాడు.
- అనంతరం ఆయన శిష్యుడు ఏర్పుల బాబయ్య పోతరాజుగా కొనసాగారు.
- ఈయన శిష్యులు కాసుల పెంటయ్య, జంగులయ్య, రాజయ్య, చెన్నయ్య, గోదాం పెంటయ్య పోతరాజులుగా వ్యవహరించారు.
- వారి అనంతరం ప్రస్తుతం 6వ తరం శివ, లక్ష్మణ్, మల్లేష్, సత్యనారాయణ, రాము తదితరులు పోతరాజులుగా బోనాల జాతరలో చురుకుగా పాల్గొంటున్నారు.
- ప్రస్తుతం మీరాలంమండిలో పోతరాజుగా రాము, శివ కొనసాగుతున్నారు.



బంగారు బోనంతో పోతరాజుల నత్యాలు (ఫైల్)

క్లుప్తంగా...

గవర్నర్‌కు ధన్యవాదాలు

అఫ్జల్‌గంజ్: రాష్ట్ర గవర్నర్ తమిళిసై ఉస్మానియా ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ నిర్వహించి ఇక్కడి వైద్యులు, సిబ్బంది పనితీరుపై ప్రశంసించినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు నేతృత్వంలో ఆరోగ్య తెలంగాణ దిశగా ముందుకు సాగుతున్నామని ఆయన అన్నారు. మంత్రి చొరవతో ఆసుపత్రికి అత్యాధునిక యంత్రాలు, వసతులు ఏర్పాటు చేయడం వల్లే ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నారని ఆయన తెలిపారు.

నార్నోల్ అగర్వాల్ సమితి అధ్యక్షుడిగా పంకజ్ కుమార్



చార్మినార్: గ్రేటర్ హైదరాబాద్ నార్నోల్ అగర్వాల్ సమితి అధ్యక్షుడిగా రికాబ్‌గంజ్‌కు చెందిన పంకజ్ కుమార్ అగర్వాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇప్పటికే హైదరాబాద్ కుంభా అగర్వాల్ బంధు, అశోక్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడిగా కొనసాగుతున్న పంకజ్ కుమార్ అగర్వాల్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల సందర్భంగా అశోక్ సింగాల్ ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా రాజేశ్ అగర్వాల్, ప్రధాన కార్యదర్శిగా రవీందర్, సంయుక్త కార్యదర్శిగా విశాల్, కోశాధికారిగా కపిల్‌లతో పాటు మరో 12 మందిని ఎగ్జిక్యూటీవ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైనట్లు అశోక్ సింగాల్ తెలిపారు. మంగళవారం పంకజ్ కుమార్ అగర్వాల్ విలేకర్లతో మాట్లాడుతూ.. నార్నోల్ అగర్వాల్ కుటుంబసభ్యుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో రగడ!

అబిడ్స్: జీహెచ్‌ఎంసీ ఫుడ్ విభాగం కార్యాలయంలో రగడ చోటుచేసుకుంది. అధికారికి, ఓ వ్యక్తి మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. అబిడ్స్ మున్సిపల్ కాంప్లెక్స్‌లోని 4వ అంతస్థులో జీహెచ్‌ఎంసీ ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ కార్యాలయం కొనసాగుతుంది. కూకట్‌పల్లిలోని ఓ హోటల్‌పై స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో జీహెచ్‌ఎంసీ అధికారులు ఆ హోటల్‌కు నోటీసులు జారీ చేశారు. కోపోద్రిక్తుడైన హోటల్‌కు సంబంధించిన వ్యక్తి మంగళవారం సాయంత్రం ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ కార్యాలయానికి విచ్చేసి రగడ సృష్టించాడు. అధికారి, ఆ వ్యక్తి మధ్య పెద్ద ఎత్తున్న వాగ్వివాదం చోటు చేసుకుంది. 4వ అంతస్థులోని కార్యాలయాల్లోకి వినిపించే విధంగా ఆ వ్యక్తి అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ బాలాజీపై అరుపులు, కేకలు పెట్టారు. కొంత మంది అధికారులు ఎంత నచ్చజెప్పినా వినకుండా యాగీ చేసి వెనుదిరిగాడు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.నీలకంఠేశ్వర్‌రావు మంగళవారం తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు తెలంగాణ టీపీసీసీ అధ్యక్షు రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలకు ప్రభావితమై పార్టీలో చేరినట్లు తెలిపారు. ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ దయానంద్, కార్మిక నాయకులు వంశీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు



నాంపల్లి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా సికింద్రాబాద్ పార్లమెంట్ సభ్యుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి నియమితులైన సందర్భంగా బీజేవైఎం సోషియల్ మీడియా ఇన్‌చార్జి సుమేరన్ కొమ్రరాజు, నగర బీజేవైఎం కార్యదర్శి విజయ్‌సింగ్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు మంగళవారం కిషన్‌రెడ్డిని హైదరాబాదులో కలిసి మెమొంటోను అందజేశారు.

బాలుడిపై లైంగిక దాడి

డబీర్‌పురా: మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ విద్యార్థిపై మరో విద్యార్థి లైంగిక దాడికి పాల్పడిన ఘటన మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం .. కాలాపత్తర్ ప్రాంతానికి చెందిన ఓ విద్యార్థి మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 2వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం సదరు విద్యార్థి మూత్ర విసర్జనకు వెళ్లగా.. అదే సమయంలో 6వ తరగతి విద్యార్థి అక్కడికి వెళ్లి ఆ విద్యార్థిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. జరిగిన ఘటనపై విద్యార్థి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సిటీ కళాశాలలో జాతీయ వెబినార్

చార్మినార్: చెంజింగ్ రోల్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీ ఇన్ టెక్నోలాజికల్ ఎన్విరాన్మెంట్ అనే అంశంపై గ్రంథాలయ శాస్త్ర విభాగం ప్రభుత్వం సిటీ కళాశాల, తెలంగాణ గ్రంథాలయ సంఘం సంయుక్తాధ్వర్యంలో ఒక రోజు జాతీయ వెబినార్‌ను నిర్వహించారు. అధ్యక్షుడిగా ఉప ప్రచార్యులు డాక్టర్ విప్లవ్ దత్ శుక్లా ప్రసంగిస్తూ ప్రస్తుత కాలంలో పౌర గ్రంథాలయ ప్రాముఖ్యతను వివరించారు. ముఖ్యఅతిథిగా హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య బి.జె.రావు పాల్గొని మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో డీప్ రీడింగ్, డీప్ ఇండెంట్ టెక్నాలజీ ఏ విధంగా గ్రంథాలయాలను ప్రభావితం చేస్తుందని.. ప్రస్తుతం పౌర గ్రంథాలయాల్లో అకడమిక్ గ్రంథాలయాల్లో హైబ్రీడ్ గ్రంథాలయాలు అవసరమన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ మందపాటి శేషగిరి రావు, సందానకర్తగా గ్రంథపాలకులు డాక్టర్ రవి కుమార్ చేగోని, తెలంగాణ గ్రంథాలయ పరిషత్తు చైర్మన్ డాక్టర్ అయాచితం శ్రీధర్, తెలంగాణ గ్రంథాలయ సంఘం అధ్యక్షుడు ఆచార్య లక్ష్మణరావు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన

యాకుత్‌పురా: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల్లో భాగంగా హరిబౌలి గజానన వ్యాయమశాలలోని మాతేశ్వరి పోచమ్మ, మహంకాళి ఆలయంలో ఐదు మంగళవారాల పాటు నిర్వహించే సాముహిక కుంకుమర్చన కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కుంకుమార్చనలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు దినేష్, సుశీల్, గోపాల్‌యాదవ్, శ్రావణ్‌కుమార్, ప్రభునాథ్, శైలేష్, కిషాన్ యాదవ్ కార్యక్రమం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అమ్మవార్లకు పట్టు వస్త్రాల సమర్పణ

యాకుత్‌పురా/గౌలిపురా: హరిబౌలి శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి ఆలయం బోనాల వజ్రోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం పాతబస్తీలోని పలు ఆలయాల్లో అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌలిపురాలోని భరతమాత, కోట మైసమ్మ ఆలయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కన్న మాదన్న మహంకాళి ఆలయ కమిటీ అధ్యక్షుడు రాందేవ్ అగర్వాల్, సలహాదారులు భరత్‌ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయలను గౌలిపురా ఆలయ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ఎస్.ఆనంద్‌రావు, మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర, ప్రధాన కార్యదర్శి మధుసూదన్ గిరి సత్కరించారు. కైలాష్ గంగపుత్ర, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, సుమన్‌కుమార్ ముదిరాజ్, శ్రీకాంత్, శివ పాల్గొన్నారు.



గౌలిపురాలోని అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించిన ఆలయ కమిటీ ప్రతినిధులు

శ్రీనివాసాచార్యులకు అర్చక పురస్కారం



సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయం ప్రధానార్చకులు నల్లదీగల శ్రీనివాసాచార్యులు టీడీసీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా చేతుల మీదుగా అర్చక పురస్కారాన్ని అందుకున్నారు. రవీంద్రభారతిలో శ్రీ అల్లూరి సీతారామరాజు 125వ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో శ్రీనివాసాచార్యులకు అర్చక పురస్కారాన్ని అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసాచార్యులకు ఆలయ చైర్మన్ యుగందర్‌రెడ్డి, ఆలయ ఈఓ బి.వేణుగోపాల్‌రావు, ఆలయ పాలక మండలి సభ్యులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

సన్మానం

గోల్కొండ: అమ్మవారికి సేవలు చేయడం కంటే పుణ్యకార్యం మరేది లేదని జగదాంబిక మహంకాళి అమ్మవార్ల వృత్తి పని సంఘం అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి అన్నారు. అమ్మవారికి 40 ఏళ్లుగా సేవలు అందిస్తున్నందుకు ఆయనకు అవార్డు వచ్చిన సందర్భంగా గోల్కొండలోని రిసాలబజార్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ అవార్డు వల్ల అమ్మవారికి మరింత శ్రద్ధతో పని చేసే అవకాశం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో చోటు.హరి, విజయ్ తదితరులున్నారు.



నోట్ బుక్స్ పంపిణీ



యాకుత్‌పురా: చైతన్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హరిబౌలి రిఫా-యే-ఆమ్ స్కూల్‌లో విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ జాతీయ టేబుల్ టెన్నీస్ క్రీడాకారిణి సైనా జైస్వాల్ హాజరై విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్, చైతన్య యూత్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుశీల్ కుమార్, సభ్యులు విజయ్‌కుమార్, నటరాజ్, నికాంత్, నవీన్, రజిని, రాజ్ కుమార్, భార్గవి, కిరణ్ పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలకు సహకరించాలి

గౌలిపురా: బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని పాతబస్తీలో ఈనెల 16, 17వ తేదీల్లో జరిగే బోనాల ఉత్సవాల సందర్భంగా ఆలయ నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మొఘల్‌పురా పోలీసులు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌స్పెక్టర్ శివకుమార్ హాజరై ఉత్సవాల నిర్వాహణపై పలు సూచనలు, సలహాలు చేశారు. ఆలయ నిర్వాహకులు అమ్మవారి ఆలయాలకు పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు రానున్న నేపథ్యంలో కమిటీ ప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సహాయ సహకారాలు అందించాలన్నారు.



ఉత్సవాల నిర్వాహకులతో ఇన్‌స్పెక్టర్ శివకుమార్

దేవిరెడ్డి రామకోటేశ్వర రావుకు గరిమెళ్ల రంగస్థల పురస్కారం



నాంపల్లి: ప్రఖ్యాత రంగస్థల నిపుణులు గరిమెళ్ల రామమూర్తి 87వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలను రసరంజని హైదరాబాద్ సంస్థ నిర్వహణలో మంగళవారం రాత్రి నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో నిర్వహించారు. సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి హాజరై వేడుకలను ప్రారంభించారు. నటుడు, దర్శకుడు దేవిరెడ్డి రామకోటేశ్వరరావుకు గరిమెళ్ల రామమూర్తి రంగస్థల పురస్కారాన్ని అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్ రావు, ఎన్టీఆర్ పురస్కార గ్రహీత దుగ్గిరాల సోమేశ్వరరావు, సుప్రసిద్ధ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, నాటక ప్రయోక్త డి.ఎస్.ఎన్.మూర్తి పాల్గొన్నారు.

చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

గోల్కొండ: జూలై 10న ఢిల్లీలో జరిగే వికలాంగుల మహాధర్నాను విజయవంతం చేస్తామని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి వెంకటేష్ అన్నారు. ఈ మహాధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం మెహిదీపట్నం ఎల్ఐసీ పార్కు వద్ద ఆవిష్కరించారు. వికలాంగులపై ముఖ్యంగా మానసిక వికలాంగులపై లైంగిక వేధింపులు పెరిగిపోతున్నాయని, వీటిని అరికట్టి వికలాంగులకు, వారి కుటుంబ సభ్యులకు కేంద్ర ప్రభుత్వం భద్ర త కల్పించాలన్నారు. వేదిక గౌరవ అధ్యక్షులు సత్యనారాయణ, అధ్యక్షులు మహమూద్, నాయకులు బస్వరాజ్ ఆరిఫ్, లక్ష్మి తదితరులున్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



గోల్కొండ: గోల్కొండ కోటకు భక్తుల తాకిడి కొనసాగుతోంది. బోనం పూజ లేకపోయినా భక్తులు కోటకు భారీగానే తరలివస్తున్నారు. మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



సంతోష్‌నగర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన మంగళవారం ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. చంపాపేట్ రాయల్ పాలిష్ షాపు వద్ద మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో 50-55 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉంది. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

ప్రజల సహకారంతోనే విధులు విజయవంతం



అబిడ్స్: ప్రజల సహకారంతోనే అధికారులు, సిబ్బంది తమ విధులను విజయవంతంగా నిర్వహించగలుగుతారని ఉస్మానియా ఆస్పత్రిలో ఉద్యోగిగా పనిచేసి పదవీ విరమణ పొందిన మాదిగ బంధుమిత్ర సంఘం ఉపాధ్యక్షుడు వెంకటేష్ పేర్కొన్నారు. చుడిబజార్‌లో ఆయనను గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు పప్పుమాత్రే, శైలేష్ కురుమ, ప్రదీప్‌రాజ్‌తో పాటు స్థానిక నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. ప్రజలు తోటి సిబ్బంది ఆస్పత్రిలోని పై అధికారుల సహకారంతో తమ విధులను విజయవంతంగా నిర్వహించామన్నారు. సుమన్‌కుమార్, నాగరాజ్, శివరామ్ ప్రసాద్, జగపతి సాయికుమార్, అనిల్, వినోద్ గోహర్, సునిల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో అన్ని పండగలకు ఆదరణ

అబిడ్స్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని ప్రజల పండగలకు ఆదరణ లభించిందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. గురుపౌర్ణమిని పురస్కరించుకుని గోషామహల్ నియోజకవర్గంలో జరిగిన పలు జాగరణ్ పూజా వేడుకల్లో ఆయన పూజలు చేసి భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. కేసీఆర్ ప్రభుత్వం చేపడుతున్న ప్రగతి, అభివృద్ధి, సంక్షేమాన్ని పలు రాష్ట్రాల ప్రభుత్వాలు ఆదర్శంగా తీసుకోవడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు కోటి శైలేష్‌కురుమ, శంకర్‌సింగ్ జమేదార్, పప్పుమాత్రే, ప్రదీప్‌రాజ్‌తో పాటు పెద్ద ఎత్తున నాయకులు పాల్గొన్నారు.



జాగరణ్ వేడుకల్లో నందకిశోర్ వ్యాస్ బిలాల్

సమస్యలను పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న దర్పల్లి నర్సిములు

జియాగూడ: ఈనెల 15 నుంచి ప్రారంభం కానున్న బోనాల వేడుకలకు ముందు జియాగూడలోని పలు సమస్యలను పరిష్కరించడంతో పాటు ఏర్పాట్లు పూర్తి చేయాలని జియాగూడ వార్డు అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ వెంకటేశంకు వినతిపత్రం అందజేసినట్లు జియాగూడ డివిజన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు దర్పల్లి నర్సిములు తెలిపారు. ఈ మేరకు మంగళవారం జియాగూడ 2బీ హెచ్‌కేలోని వార్డు కార్యాలయంలో అధికారిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 15, 16, 17వ తేదీల్లో బోనాల వేడుకలు జరుగనున్న దృష్ట్యా ఎలాంటి విద్యుత్ అంతరాయం జరుగకుండా సీబీడీ ద్వారా పర్యావేక్షణ కొనసాగించాలన్నారు. మాతేశ్వరీ ఊరేగింపులు కొనసాగనున్న దృష్ట్యా రోడ్లపై చెత్తకుప్పలు, మట్టికుప్పలు తొలగించి గుంతలలో డాంబర్ మిక్సింగ్ ప్యాచ్‌వర్క్‌లు చేపట్టాలని అలాగే స్ట్రీట్‌లైట్స్ మరమ్మతులు, ఆలయాల వద్ద నూతనంగా వీధిదీపాల ఏర్పాటు తదితరవి చేపట్టాలన్నారు. పలు సమస్యలపై అందజేసిన వినతి పత్రాలు వెంటనే ఆయా విభాగ అధికారులకు పంపించి బోనాల వేడుకలకు అన్ని సమస్యలు పరిష్కరించాలని తెలిపారు.

హుండీ ఆదాయం లెక్కింపు

గోల్కొండ: జగదాంబిక మహంకాళి అమ్మవారి బోనాలకు భక్తులు భారీగా తరలి వస్తున్నారు. ఇప్పటి వరకు అమ్మవారికి 4 పూజలు జరిగాయి. 3వ, 4వ పూజకు సంబంధించిన హుండీని మంగళవారం అధికారులు లెక్కించారు. హుండీ ద్వారా అమ్మవారికి మొత్తం రూ.3,97,253 లు ఆదాయం వచ్చింది. ఇప్పటి వరకు జరిగిన 4 పూజలకు మొత్తం రూ.6,35,948 ఆదాయం వచ్చిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసరాజు, మహంకాళి అమ్మవారి పూజారి సురేష్ చారి, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆదాయాన్ని లెక్కిస్తున్న ఈఓ శ్రీనివాసరాజు తదితరులు

అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న టీఎన్జీఓస్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని

అబిడ్స్: టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో రెడ్‌హిల్స్‌లోని ఎంఎన్‌జే ఆస్పత్రి వద్ద అన్నదానం పంపిణీ చేశారు. దాదాపు 600 మంది రోగుల సహాయకులకు ఈ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ.. మానవ సేవాయే మాధవ సేవా అన్నారు. తరచు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.విక్రమ్‌కుమార్, రాజ్‌కుమార్, కురాడి శ్రీనివాస్, శంకర్, నరేష్‌కుమార్, శివకుమార్, అరుణజ్యోతి, శేఖర్, సుదర్శన్ పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి

గన్‌ఫౌండ్రీ: అల్లూరి సీతారామరాజును నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 125వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురికి అల్లూరి సీరామరాజు స్మారక పురస్కారాలను ప్రదానం చేయడంతో పాటు కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత జడ్జి బూర్గుల మధుసూదన్ రావు, ఆడిటర్ సుబ్బారావు, నిర్వాహకులు మురళీ మోహన్‌రాజు, డాక్టర్ ఎస్.రాంచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



పురస్కార గ్రహీతలతో ఉప్పల శ్రీనివాస్‌గుప్తా తదితరులు